అమితాబ్, రజనీకాంత్

నా గుండె ఆనందంతో కొట్టుకుంటున్నది

రజనీకాంత్ బేసిగ్గా అమితాబ్ అభిమాని. నటుడిగా తనపై బిగ్‌బీ ప్రభావం చాలా ఉందని పలు సందర్భాల్లో చెప్పారు కూడా. తమిళనాట సూపర్‌స్టార్‌గా ఉండికూడా బాలీవుడ్‌లో అమితాబ్‌తో కొన్ని సినిమాలు చేశారు రజనీ. మళ్లీ దాదాపు 33ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అమితాబ్‌తో ఆయన నటించబోతున్నాడు. టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందనున్న తన 170వ చిత్రంలో వీరిద్దరూ తెరను పంచుకోబోతున్నారు. ఈ విషయంపై సూపర్‌స్టార్ ఎక్స్(ట్విటర్) ద్వారా ఆనందాన్ని పంచుకున్నారు. ' 33ఏళ్ల తర్వాత నా గురువు, మార్గదర్శకుడు, దిగ్గేట్ అమితాబ్‌గారితో నటించబోతున్నాను. నా గుండె ఆనందంతో కొట్టుకుంటుంది' అంటూ ట్వీట్ చేశారు తలైవా. ఇద్దరు సూపర్‌స్టార్లు తెరను పంచుకోబోతున్న ఈ సినిమాపై అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఇది అభిమానులకే కాదు, సగటు ప్రేక్షకుడికి కూడా ఆనందాన్ని పంచే వార్తే.

నయనతార

చికెన్ లెగ్‌పీస్ బహుబాగు సుమీ..

సౌతిండియాలో లేడీ సూపర్‌స్టార్ అంటే రపేమని చెప్పే పేరు నయనతార. హీరోయిన్లలో ఎక్కువ పారితోషికం తీసుకుంటున్న స్టార్ కూడా తనేనని టాక్. దక్షిణాది భాషలన్నింటిలో విజయాలను అందుకున్న ఈ ముద్దుగుమ్మ, రీసెంట్‌గా 'జవాన్'తో బాలీవుడ్‌లో కూడా విజయకేతనం ఎగరవేసింది. అక్కడ కూడా లెక్కకు మించిన అవకాశాలు నయన్‌ని పలకరిస్తున్నాయి. ప్రస్తుతం ఈ లేడీ సూపర్‌స్టార్ తన 75వ చిత్రంలో నటిస్తున్నది. ఈ ల్యాండ్‌మార్క్ మూవీని ఆమె ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్టు సన్నిహిత వర్గాల సమాచారం. లేడీ ఓరియెంటెడ్ కథాంశంగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'అన్నపూరాణి' అనే పేరును ఖరారు చేశారు. 'ది గాడెస్ ఆఫ్ టేస్ట్' అనేది ఉపశీర్షిక. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. ఇందులో అగ్నిహోత్రంలాంటి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన అమ్మాయిగా నయన్ కనిపిస్తున్నది. నాన్న, నాయనమ్మ పూజాపునస్కారాలతో తరిస్తుంటే, తను మాత్రం బుక్‌లో చికెన్ లెగ్ పీస్‌ల బొమ్మల్ని చూస్తూ నోరు ఊరించుకుంటూ కనిపిస్తున్నది. దీన్నిబట్టి ఇది కామెడీ సినిమా అని చెప్పొచ్చు. ఈ చిత్రం ద్వారా నీలేష్ కృష్ణ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఇదిలావుంటే, నయన్ సౌందర్య ఉత్పత్తుల మార్కెట్‌లోకి కూడా ఎంటరైంది. తన కాస్మొటిక్స్‌లో కెమికల్స్ తక్కువగా, ప్రకృతి సిద్ధ పదార్థాలు ఎక్కువగా ఉంటాయని, సౌందర్యం కోసం తాను వాడేవాటినే కస్టమర్లకు కూడా అందిస్తానని నయన చెబుతున్నది. డ్యూయెల్‌రోల్ అనమాట.

చరణ్‌రాజ్

పాత్ర నచ్చితే ఉచితంగా నటిస్తా

'ఎనిమిదేళ్లు అర్ధాకలితో కష్టపడ్డాను. ఆ కష్టానికి ప్రతిఫలంగా నలభైఏళ్ల కెరీర్ దక్కింది' అన్నారు సీనియర్ విలన్ చరణ్‌రాజ్. ఆయన 'నరకాసుర' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. రక్షిత్ అట్లూరి, అపర్ణ జనార్దన్, సంకీర్తన విపిన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకుడు. నవంబర్ 3న పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చరణ్‌రాజ్ మీడియాతో మాట్లాడారు. ఇక నుంచి రొటీన్ కేరక్టర్‌లు చేయకూడదని నిర్ణయించుకున్నాను. రొటీన్ విలన్ పాత్రలు వస్తుంటే చేయనని చెప్పేస్తున్నాను. మంచి పాత్ర అయితే డబ్బుతో ప్రమేయం లేకుండా నటిస్తా' అన్నారు చరణ్‌రాజ్. 'నరకాసుర'లో తన పాత్ర అద్భుతంగా ఉంటుందని, అందుకే దర్శకుడి వెంటబడి మరీ ఈ పాత్రను తీసుకున్నానని చరణ్‌రాజ్ చెప్పారు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచే సినిమా 'నరకాసుర' అని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఇంకా మంచి పాత్రలు చేయాలీ, ప్రేక్షకుల అభిమానాన్ని పొందాలీ.. అదే తన లక్ష్యమని చరణ్‌రాజ్ చెప్పారు.

అబ్బురపరిచే సుబ్రహ్మణ్య

అద్వయ్

బొమ్మాలి రవిశంకర్ కుమారుడు అద్వయ్‌ని హీరోగా పరిచయం చేస్తూ రూపొందుతున్న చిత్రం 'సుబ్రహ్మణ్య'. పి.రవిశంకర్ దర్శకత్వంలో తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. సినిమా విభిన్నంగా ఉంటుందని, ఎన్నో ప్రత్యేకతల సమాహారంగా ఈ సినిమాను దర్శకుడు తెరకెక్కిస్తున్నాడని, థ్రిలింగ్ ఎలిమెంట్స్‌తోపాటు కథాపరంగా కొన్ని భక్తికి సంబంధించిన అంశాలు కూడా ఇందులో ఉంటాయని నిర్మాతలు చెబుతున్నారు. అబ్బురపరిచే సాంకేతికతతో తెరకెక్కుతున్న ఈ చిత్రం వెండితెర విజువల్ వండర్‌గా ఉంటుందని వారు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: రవి బాసూర్, మాటలు: మస్తీ. నిర్మాణం: ఎస్.జి.మూవీ మేకర్స్.

కంగనారనౌత్

నేను పొగరుబోతునా?

'నాపైనే ఎందుకు అంత ద్వేషం.. నేనేం చేశాను మిమ్మల్ని?' అంటూ వాపోతున్నది అందాలభామ కంగనారనౌత్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సోషల్ మీడియాపై తనకున్న అక్కసునంతా కక్కేసింది తను. ' నేను స్ట్రయిట్ ఫార్వాడ్‌గా ఉంటాను. నిర్మొమాటంగా మాట్లాడేస్తాను. నిజంలో బతుకుతాను. అదే కొందరికి నచ్చట్లేదు. ఆత్మాభిమానాన్ని చంపుకొని బతికేవాళ్లంతా లొక్యం తెలిసినవాళ్లు. నిజాయితీగా ఉన్న నేను పొగరుబోతునా?' అంటూ ఇంటర్వ్యూలో నేరుగా ప్రశ్నించింది. ఇంతకీ కంగనాకు అంత కోపం రావడానికి కారణం ఏంటంటే.. ఈ ముద్దుగుమ్మ సినిమాలపై కొందరు కావాలని కక్ష గట్టి విడుదలకు ముందు నెగిటీవ్ ప్రచారం చేస్తున్నారంట. ఈ విషయాన్ని తెలియజేస్తూ బాధను వ్యక్తం చేసింది కంగనా. ' ఈ మధ్య నా సినిమాలు సరిగ్గా ఆడలేదు. అవి జనరంజకంగా తయారవ్వకపోవడం ఒక కారణమైతే, కొందరు పనిగట్టుకొని చేసిన నెగిటీవ్ ప్రచారం ఒక కారణం. మిగతా హీరోయిన్ల విషయంలో సాఫ్ట్‌గా ఉంటారు. నా విషయాని కొచ్చే సరికి అవాకులు చవాకులు రాస్తారు' అంటూ మండిపడ్డది కంగనా. ఈమె బాధ పగవాళ్లకు కూడా రాకూడదని పలువురు మాట్లాడుకుంటున్నారు.

గణేశ్, ప్రీతి సుందర్

యువతరం స్పీడ్

గణేశ్, హేమంత్, ప్రీతి సుందర్, జాహ్నవి శర్మ ప్రధానపాత్రధారులుగా రూపొందుతోన్న చిత్రం 'స్పీడ్ 220'. హర్షా బెజగం దర్శకుడు. సూర్యనారాయణ, దుర్గారావు, ఆనంద్ నిర్మాతలు. ఈ చిత్రం టీజర్‌ని నిర్మాత సి.కళ్యాణ్ విడుదల చేశారు. అన్ని వర్గాలకూ నచ్చేలా దర్శకుడు హర్ష ఈ చిత్రాన్ని మలిచారని, తప్పకుండా మంచి విజయం సాధిస్తుందని సి.కళ్యాణ్ నమ్మకం వ్యక్తం చేశారు. నేటి జనరేషన్‌కి సరిగ్గా కనక్టయ్యే సినిమా ఇదని, త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: క్రాంతికుమార్, సంగీతం: శేఖర్ మోపూరి,

కార్తీ, అను ఇమ్మాన్యుయేల్

గాయకుడిగా మారిన కార్తీ

ప్రముఖ హీరో కార్తీ నటిస్తున్న విభిన్న చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకుడు. ఎస్.ఆర్.ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు నిర్మాతలు. జి.వి.ప్రకాశ్‌కుమార్ స్వరపరిచిన ఈ చిత్రం తొలి పాటను మేకర్స్ విడుదల చేశారు. గాయని ఇంద్రావతి చౌహాన్‌తో కలిసి హీరో కార్తీ స్వయంగా ఈ పాటను ఆలపించడం విశేషం. భాస్కరభట్ల సాహిత్యం అందించిన ఈ పాటను హీరో కార్తీ, అను ఇమ్మాన్యుయేల్‌లపై చిత్రీకరించడం జరిగింది. ఈ పాటలో హీరోహీరోయన్ల కెమిస్ట్రీ అద్భుతంగా ఉంటుందని నిర్మాతలు చెబుతున్నారు. 'జపాన్' కార్తీ కెరీర్‌లోనే విభిన్నమైన సినిమా అని, ఇందులో కొత్త కార్తీని చూస్తారని మేకర్స్ నమ్మకంగా చెబుతున్నారు. సునీల్, విజయ్ మిల్టన్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవి వర్మన్.

మలినేని గోపీచంద్, రవితేజ, నవీన్ యెర్నేని, వై.రవిశంకర్

మళ్లీ కుదిరిన మైత్రి

రవితేజ హీరోగా మలినేని గోపీచంద్ దర్శకత్వంలో సినిమా అంటే చాలు హిట్ పక్కా. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలన్నీ దాదాపు హిట్లే. బ్లాక్‌బాస్టర్ 'క్రాక్' తర్వాత మళ్లీ మరో వినూత్నమైన మాస్ కథాంశంతో వీరిద్దరూ కలిసి రాబోతున్నారు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈచిత్రం షూటింగ్ త్వరలో మొదలుకానుంది. వాస్తవ సంఘటన ఆధారంగా యునిక్, పవర్‌ఫుల్ కథాంశంతో ఈ చిత్రం రూపొందనుందని మలినేని గోపీచంద్ చెప్పారు. ఈ సినిమాకు సంబంధించిన బ్లాస్టింగ్ అప్‌డేట్‌ల కోసం ప్రేక్షకులు సిద్ధంగా ఉండాలని, మునుపెన్నడూ చూడనంత శక్తిమంతమైన పాత్రలో రవితేజని ప్రేక్షకులు చూడబోతున్నారని, అలాగే వెర్సటైల్ డైరెక్టర్, యాక్టర్ సెల్వరాఘవన్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయన పాత్ర విభిన్నంగా మెమరబుల్‌గా ఉంటుందని మేకర్స్ తెలియజేశారు. జి.కె.విష్ణు ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: థమన్.

పంజా వైష్ణవ్‌తేజ్, శ్రీలీల

లీలమ్మో.. శ్రీలీలమ్మో..

పంజా వైష్ణవ్‌తేజ్, శ్రీలీల జంటగా రూపొందుతున్న చిత్రం 'ఆదికేశవ'. శ్రీకాంత్ ఎన్.రెడ్డి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జి.వి.ప్రకాశ్‌కుమార్ స్వరాలందించిన ఈ చిత్రానికి చెందిన మూడవ పాటను బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. 'లీలమ్మో..' అంటూ సాగే ఈ పాటను పంజా వైష్ణవ్‌తేజ్, శ్రీలీలపై చిత్రీకరించామని, ఈ సినిమా ప్రథమార్థమంతా వైష్ణవ్, శ్రీలీల, సుదర్శన్ కాంబినేషన్లో సరదాగా సాగిపోతుందని, సెకండాఫ్ మాత్రం అవుట్ అండ్ అవుట్ యాక్షన్ నేపథ్యంలో సాగుతుందని దర్శకుడు చెప్పారు. తన పేరుతో మొదలయ్యే 'లీలమ్మో..' పాటంటే తనకెంతో ఇష్టమని, అందరూ ఎంజాయ్ చేసేలా ఈ పాట ఉంటుందని శ్రీలీల చెప్పింది. షూటింగ్ సరదాగా సాగిపోతుందని, అలాగే సినిమా కూడా సరదాసరదాగా ఉంటుందని పంజా వైష్ణవ్‌తేజ్ అన్నారు. నవంబర్ 10న ప్రపంచవ్యాప్తం సినిమా విడుదల కానుంది. జోజు జార్జ్, అపర్ణాదాస్ ప్రత్యేక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: డడ్లీ, ప్రసాద్ మూరెళ్ల.

సందీప్ కిషన్, వర్ష

స్వరాల భైరవకోన

సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ, కావ్య థాపర్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతోన్న చిత్రం 'ఊరుపేరు భైరవకోన'. వి.ఐ.ఆనంద్ దర్శకుడు. రాజేశ్ దండా నిర్మాత. శేఖర్‌చంద్ర స్వరాలందించిన ఈ చిత్రానికి సంబంధించిన రెండో పాటను అక్టోబర్ 28న విడుదల చేయనున్నారు. 'హమ్మా.. హమ్మా..' అంటూ సాగే ఈ పాటను సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ పై చిత్రీకరించారని, థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతోన్న ఈ చిత్రం సంగీత పరంగా కూడా ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట.

మానస చౌదరి, రోషన్ కనకాల

యూత్‌ఫుల్ బబుల్‌గమ్

సుమ, రాజీవ్ కనకాల తనయుడు రోషన్ కనకాల హీరోగా 'బబుల్‌గమ్' అనే సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. మానస చౌదరి కథానాయిక. రవికాంత్ పేరెవు దర్శకుడు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, మహేశ్వరి మూవీస్ కలిసి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీచరణ్ పాకాల స్వరాలందించిన ఈచిత్రానికి చెందిన తొలి పాటను నవంబర్ 3న మేకర్స్ విడుదల చేయనున్నారు. ఇందులో రోషన్ నటన అందర్నీ అలరిస్తుందని, ప్రేమ కథాచిత్రాల్లో కొత్త ట్రెండ్ సృష్టించే సినిమా ఇదని మేకర్స్ అన్నారు. దర్శకుడు యువతరాన్ని ఆకట్టుకునే కథని ఎంచుకొని మ్యూజికల్ లవ్‌స్టోరీగా మలిచాడని, డిసెంబర్ 29న సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సురేశ్ రగుతు.

సుడిగాలి సుధీర్, డాలీషా

ఊహించని మలుపులతో

సుడిగాలి సుధీర్, డాలీషా జంటగా రూపొందుతున్న చిత్రం 'కాలింగ్ సహస్ర'. అరుణ్ విక్కిరాలా దర్శకుడు. విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాలూరి నిర్మాతలు. ఈ చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సుధీర్ పాత్ర కొత్తగా ఉంటుందని, వైల్డ్‌గా, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మాస్ ప్రేక్షకులకు నచ్చేలా అతని పాత్ర సాగుతుందని, ఊహించని మలుపులతో సాగే కథ ఇదని నవంబర్‌లో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు. శివబాలాజీ, మనోహరన్, రవితేజ సన్నిమాల తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: సన్నిడి.